# ఇరిగేషన్‌లో పంచముఖుడు

- ఒక్కడికే ఐదు చోట్ల అదనపు బాధ్యతలు
- ముఖ్యమంత్రి ఆప్తమిత్రుడని అందలం!
- నాగర్‌కర్నూల్ ఎస్‌ఈ విజయభాస్కర్‌రెడ్డికి సీఈ, ఎండీ, ఈఎన్సీగానూ బాధ్యతలు
- సీనియార్టీ జాబితాకు సైతం పాతర
- జూనియర్లకే ఇన్‌చార్జి బాధ్యతలు
- ఇదేం సంస్కృతని ఇంజినీర్ల మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ముఖ్యమంత్రి ఆప్తమిత్రుడికి ఏకంగా ఐదు బాధ్యతలు అప్పగించినట్టు చర్చ జరుగుతున్నది. నిబంధనలను తుంగలో తొక్కి నచ్చినవాళ్లకు, నచ్చిన చోట రేవంత్ సర్కార్ పోస్టింగ్‌లు ఇస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు తాజాగా ఓఅండ్‌ఎం (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఈఎన్సీగా విజయభాస్కర్‌రెడ్డిని నియమించడమే నిదర్శనమని శాఖలోని పలువురు ఇంజినీర్లే చెప్తున్నారు. ఈఎన్సీగానే కాకుండా మరికొన్ని చోట్ల ఆయన ఒక్కడికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, సీనియర్లను కాదని ఎలా నియమిస్తారని మండిపడుతున్నారు.

### ఒక్కడికే ఐదు పోస్టులు

సాగునీటిపారుదలశాఖ ఓఅండ్‌ఎం ఈఎన్సీగా విజయభాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవల నియమించింది. చీఫ్ ఇంజినీర్ కాని వ్యక్తిని ఏకంగా ఈఎన్సీ పోస్టులో నేరుగా నియమించడమే ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. వాస్తవంగా ఆయన నాగర్‌కర్నూల్ సర్కిల్-1 ఎస్‌ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ సీఈగా విధులు నిర్వర్తించిన హామీద్‌ఖాన్ గత మేలో విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో ఎస్‌ఈ విజయభాస్కర్‌రెడ్డికే సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత వనపర్తి సీఈ విరమణ పొందగా ఆ బాధ్యతలను కూడా విజయభాస్కర్‌రెడ్డికే అప్పగించారు. తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ ఎండీగానూ నియమించారు. కాళేశ్వరం కమిషన్‌లో టెక్నికల్ సీఈగానూ ఆయననే నియమించడం గమనార్హం. అసలు చీఫ్ ఇంజినీర్ కాకముందే ఇప్పటికే నాలుగు చోట్ల అదనపు బాధ్యతలను అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. సీఈ కాకముందే ఓఅండ్‌ఎం ఈఎన్సీ స్థానాన్ని ప్రభుత్వం కట్టబెట్టడం కొసమెరుపు.

### సీనియర్లను కాదని

ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అనేక మంది సీనియర్ చీఫ్ ఇంజినీర్లు ఈఎన్సీ ప్రమోషన్ల జాబితాలో ఉన్నారు. ఓఅండ్‌ఎం ఈఎన్సీగా పనిచేసిన నాగేందర్‌రావు గత నవంబర్‌లో విరమణ పొందారు. ఆయన స్థానంలో సీనియార్టీ జాబితాలో ముందున్న చీఫ్ ఇంజినీర్లు శ్రీనివాస్, అమ్జద్‌హుస్సేన్ పేర్లను ప్రభుత్వానికి ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ ప్రతిపాదించారు. వారు కాకుండా జోన్ 6లోనూ సీనియర్ చీఫ్ ఇంజినీర్లు మోహన్‌కుమార్, ప్రమీల, అనితతోపాటు ఇంకా అనేక మంది ఉన్నారు. కానీ ప్రభుత్వం సీనియర్ చీఫ్ ఇంజినీర్లను పక్కనపెట్టి విజయభాస్కర్‌రెడ్డినే నియమించడం విమర్శలకు దారితీసింది. దీనివెనక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చక్రం తిప్పారని ఇరిగేషన్‌వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది.



విజయభాస్కర్‌రెడ్డి

### నచ్చినోళ్లకే ఎఫ్‌ఏసీలా?

ఇటీవల ఉద్యోగ విమరణ పొందిన వారి స్థానాన్ని ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలి. లేదంటే ఆ డివిజన్‌లో సీనియరైన మరొకరికి అదనపు బాధ్యతలు అప్పగించాలి. కానీ, నచ్చినవారికి ఎఫ్‌ఏసీలుగా బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. తాజాగా శాఖలో పదుల సంఖ్యలో ఇంజినీర్లకు ఈఈలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# కబ్జాపై అధికారుల కట్టు కథలు!

- బంజారాహిల్స్‌లో జలమండలి భూమి ఆక్రమణ
- 'నమస్తే తెలంగాణ' కథనంతో బయటపడ్డ కబ్జా
- పరిశీలించిన వాటర్‌బోర్డు ఎండీ
- 200 కోట్ల విలువైన భూమిపై అధికారుల కహానీలు!



బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లో ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న జలమండలి స్థలాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ తదితరులు

బంజారాహిల్స్, డిసెంబర్ 20: హైదరాబాద్‌లో బంజారాహిల్స్ ప్రాంతంలో భూమికి భారీ డిమాండ్ ఉంటుంది. ఎక్కడైనా యజమానులు తమ భూమిలో ఒక్క గజం కూడా ఆక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు పాటిస్తారు. మరి అలాంటిది బంజారాహిల్స్ ప్రాంతంలో ఓనర్స్ ఇంకెంత జాగ్రత్తగా ఉంటారో అర్థం చేసుకోవచ్చు. కానీ హైదరాబాద్ మహానగరం మొత్తానికి తాగునీరు సరఫరా చేసే జలమండలి అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారంటే డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఎకరన్నర భూమి కబ్జాకు గురయితే కనీసం తమ దృష్టిలో కూడా లేదని చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని 'నమస్తే తెలంగాణ' కథనంతో బయటపెట్టడంతో "అరేరే.. అలా జరిగిందా.. మాకు తెలియదే..!" అంటూ కహానీలు చెబుతున్నారు.

### నిద్రమేల్కొన్న అధికారుల ఉలిక్కిపాటు!

ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్‌నం-10లో జలమండలికి మొదటి విడతగా ఎకరం స్థలం కేటాయించింది. ఆ భూమిని జలమండలి కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నది. రెండో విడతలో ఎకరన్నర కేటాయించింది. కానీ ఆ స్థలాన్ని గాలికి వదిలేసింది. ప్రైవేటు వ్యక్తుల స్థలాలనే కబ్జా చేసుకునే దొంగలు ఉన్న ఈ రోజుల్లో.. ప్రభుత్వ స్థలం, అందులోనూ ఆ డిపార్ట్‌మెంటే పట్టించుకోకుండా వదిలేసిన స్థలం కావడంతో ఇటీవల అక్రమార్కుల కన్నుపడింది. రూ.200 కోట్ల విలువైన జలమండలి స్థలాన్ని పార్థసారథి అనే వ్యక్తి కబ్జా చేశాడు. ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. లోపల గదుల నిర్మాణాలు కూడా మొదలుపెట్టాడు. తన వ్యక్తిగత సిబ్బందిని బందోబస్తుగా పెట్టుకున్నాడు. ఈ వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. జలమండలి అధికారులు నిద్ర నటిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, విజిలెన్స్, హైడ్రా అధికారులు హడావుడిగా స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని రక్షించడంలో నిర్లక్ష్యం వహించారంటూ జలమండలి స్థానిక అధికారులపై మండిపడ్డారు. అక్రమార్కులు స్థలాన్ని కబ్జా చేస్తుంటే కనబడటం లేదా అని ప్రశ్నించారు.

### అంతా మీరే చేశారు.. మాకేం తెలియదు!

హైదరాబాద్ నగరం నడిమధ్యలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురయితే అధికారులు అర్థంపర్థం లేని సాకులు చెబుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేయకపోవడం వల్లే స్థలం అన్యాక్రాంతమైందని జలమండలి అధికారులు సమర్థించుకున్నారు. మార్కింగ్ చేసి ఇస్తే ప్రహరీ నిర్మించేవాళ్లమని ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. క్షేత్రస్థాయి అధికారులు మార్కింగ్ చేసినట్టు తమకు చెప్పారని, కానీ మార్కింగ్ చేయలేదని, ఆ సంగతి కూడా తెలియదని రెవెన్యూ అధికారులు సమర్థించుకున్నారు. జలమండలి ఎండీ సమక్షంలో రెండు విభాగాల అధికారులు మీరంటే మీరే కారణమని చేతులు దులుపుకున్నారు. దీంతో షేక్‌పేట మండల సర్వేయర్లు ఫీల్డ్ మార్కింగ్ చేశారు. సదరు స్థలం ప్రభుత్వానికి చెందినదని బోర్డు ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు రంగంలోకి దిగడంతో కబ్జాదారుల మనుషులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కబ్జా వెనుక ఎవరున్నారనే వివరాలు మాత్రం అధికారులు వెల్లడించలేదు.

### అబ్బే... అసలు కబ్జానే జరగలేదు!

'నమస్తే తెలంగాణ' కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది. అక్రమార్కుల చేతుల్లో చిక్కుకున్న ప్రభుత్వ స్థలం సురక్షితమైంది. రోజంతా ఉన్నతాధికారుల హడావుడితో పరుగులు పెట్టిన జలమండలి, రెవెన్యూ అధికారులు సాయంత్రానికి అసలేమీ జరగనట్టు వ్యవహరించారు. జలమండలి స్థలంలో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని షేక్‌పేట్ మండల రెవెన్యూ అధికారులు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జలమండలి అధికారులు కోరడంతో స్థలానికి మార్కింగ్ చేసి ఇచ్చామని తెలిపారు. అక్రమార్కులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడం, లోపల గదులు నిర్మించుకున్నారు కదా అని అడిగితే మాత్రం సమాధానం దాటవేశారు. జలమండలి ఎండీ స్వయంగా పరిశీలించి కబ్జాపై అధికారులపై మండిపడ్డారు. కానీ జలమండలి అధికారికంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాత్రం కబ్జా వార్తలు అవాస్తవమని బుకాయించారు.






## ఏఐఎస్ఎఫ్ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- విద్యార్థి నాయకుల అరెస్టు, పోలీస్‌స్టేషన్లకు తరలింపు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ ముట్టడి' ఉద్రిక్తంగా మారింది. పోలీసులు విద్యార్థి నాయకులను అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై మతతత్వ భావజాలాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నదని, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జాతీయ విద్యా విధానం రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి ఆయా కళాశాలలను సీజ్ చేయాలని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్లను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోతు రఘురాంనాయక్, మడుపల్లి లక్ష్మణ్, బాషబోయిన సంతోష్, మురళి, రమేశ్, అన్వర్, ప్రేమ్, చైతన్య, అంజి, శరత్, దత్తు, లోకేశ్ పాల్గొన్నారు.

### అక్రమ అరెస్టులు మానుకోవాలి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడికి పిలుపు ఇవ్వకున్నా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్రను పోలీసులు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులకు భంగం కలిగేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని, అరెస్టులతో అణచివేయవచ్చనే దృక్పథాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన



సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ నిరవధిక దీక్షలు చేపట్టిన సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు శుక్రవారం కామారెడ్డిలో వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం నుంచి బోనాలతో మైసమ్మ ఆలయానికి ర్యాలీగా వెళ్లారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు పేస్కేల్ అమలు చేయాలని అమ్మవారికి మొక్కుకున్నారు. - కామారెడ్డి

## మద్యం ప్రియులకు బస్టాండ్ క్లీనింగ్ శిక్ష

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 20 : ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పలువురు మందుబాబులను మంచిర్యాల సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా, నలుగురికి ఐదు రోజుల పాటు మంచిర్యాల బస్టాండ్ క్లీనింగ్ శిక్ష విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మరో 14 మందికి ట్రాఫిక్ అసిస్టెంట్ విధులు వేసినట్టు పేర్కొన్నారు. మిగతా వారికి రూ.17,500 జరిమానా విధించినట్టు వెల్లడించారు.



మంచిర్యాల బస్టాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న మద్యంప్రియులు



అప్పాయిపల్లిలో సర్వే పనులను అడ్డుకుంటున్న భూనిర్వాసితులు

## కొడంగల్ మెడికల్ కాలేజీ సర్వే పనుల అడ్డగింత

- పూర్తి పారితోషికాన్ని అందించాలని రైతుల డిమాండ్

కొడంగల్, డిసెంబర్ 20: పూర్తిస్థాయి నష్ట పరిహారం అందించిన తరువాతే పనులు చేపట్టాలని మండలం అప్పాయిపల్లి గ్రామ సర్వే నం 19 రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మాణాల కోసం చేస్తున్న సర్వే పనులను రైతులు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణాలకు సంతోషంగా భూములను అప్పగించామని... కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పారితోషికాన్ని పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. భూములు అందించిన రైతులకు ఎకరాకు రూ.10 లక్షలు, ఇండ్ల స్థలాలతో పాటు ఉద్యోగం ఇవ్వడానికి ఒప్పందం జరిగిందన్నారు. రైతులకు అరకొర పారితోషికాన్ని అందించడంతో ఇండ్ల స్థలాలను తీసుకోలేదని చెప్పారు.

# రాళ్ల మేటలు.. కన్నీటి ఊటలు..!

- నష్టపరిహారం రాక రైతు కుటుంబం ఆవేదన

నర్సింహులపేట, డిసెంబర్ 20 : భారీ వర్షాల కారణంగా మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలవ్యాప్తంగా చెరువులు, కుంటలు తెగిపోవడంతోపాటు వాగులు, వంకలు ఉప్పొంగడంతో అప్పటి వరకు పచ్చని పంటలతో కళకళలాడిన పొలాల్లో ఇసుక, రాళ్లురప్పలు, మట్టి మేటలువేశాయి. రైతులను ఆదుకుంటామని, నష్టపరిహారం అందిస్తామని హడావుడి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు కాలక్రమంలో మరిచిపోయారు. నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెంలో గ్రామానికి చెందిన గణేశ్ చెరువు తెగిపోవడంతో రోడ్డు కొట్టుకుపోయి చుక్క ఉప్పలయ్య పొలంలో రాళ్లురప్పలు పెద్ద ఎత్తున మేటలు వేశాయి. ఇప్పటి వరకు నయా పైస పరిహారం రాలేదని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వారం రోజుల నుంచి కుటుంబ సభ్యులందరూ కలిసి రాళ్లు ఏరుతున్నారు. ఇప్పటికైనా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో పొలంలో మేట వేసిన రాళ్లను ఏరుతున్న రైతు ఉప్పలయ్య, కుటుంబ సభ్యులు






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.